
# విలక్షణ

గన్నెపూడి రాధాకృష్ణమూర్తి





(గత సంచిక తరువాయి)

"చిన్నతనం నుంచి చదువు మీదికన్నా ఆటపాటల మీద మక్కువ ఎక్కువ. నసర్ స్కూల్లో మూడో తరగతిలో ఉన్నప్పుడు ఏకలవ్య వేషం వేశాను. గురుదక్షిణగా ద్రోణాచార్యుడికి బొటనవేలు కోసి అర్పించినప్పుడు ఆడిటోరియం కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా బాధపడింది. ఆ తర్వాత చాలా సేపు చప్పట్లతో మారుమోగిపోయింది.

ఐదో తరగతిలో తెనాలి రామకృష్ణుడి వేషం చూసిన ఆనాటి ముఖ్య అతిథి గుమ్మడిగారు తన అధ్యక్షోపన్యాసంలో "పైన ఉన్న ఆ తెనాలి రామకృష్ణ కవి ఈనాడు ఈ చిరంజీవి నటన చూసి ఉంటే నేను 'ఇలా ఉంటానా?" అని ఆనందంతో చప్పట్లు చరుస్తూ గంతులు వేసే వాడు" అన్నారు. హైస్కూల్లో బాలచంద్రుడిగా నటించినప్పుడు ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా కలెక్టరుగారు గ్రీన్‌రూంలోకొచ్చి "పేరు పొందిన సినీ హీరోలతో సమానంగా నటించా" నని వీపు తట్టి మెచ్చుకున్నారు. ఆ రోజుల్లో పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో బంగారు పతకాలు సాధించి వెండితెర మీద వెలుగుతున్న అమ్జాద్ ఖాన్, అనుపం ఖేర్, జయాభాదురిలాగా అవాలని కలలు కంటుండేవాడిని.

మమ్మీ ద్వారా డాడీకి అప్లికేషన్ పెట్టుకున్నాను. యాక్టింగ్ స్కూల్లో చేరుతానని. "ఇటువంటి టాలంట్ ఉన్నవారు ఎందరో పాండీ బజార్లో ఈపూట ఎవరు టీ ఇప్పిస్తారా" అని ఎదురు చూస్తుంటారు. ఈ ఫీల్డులో టాలంట్ ఒక్కటే చాలదు. ఇంకా ఎన్నో సహాయ సహకారాలు కావాలి. ఇటువంటి వెర్రి ఆలోచనలు కట్టిపెట్టి ధ్యాస చదువు మీదికి మళ్ళించమను" నామీది కోపంతో మమ్మీకి సీరియస్‌గా పాఠం చెబుతున్న డాడీ స్వరం నాకు తగిలిన ఎదురు దెబ్బ.

నాకు డ్రాయింగ్ అంటే ఎంతో ఇష్టం. నేను వేసిన బొమ్మలు చూసి 'నాకంటే నువ్వే బాగా వేస్తావోయ్' అని మెచ్చుకునేవారు మా డ్రాయింగ్ మాస్టరు. ఆనంద బాలానంద సంఘంలో వరసగా మూడు సంవత్సరాలు ఫస్టు ప్రైజు సంపాయించాను. అమెరికా నుంచి వచ్చిన డాడీ స్నేహితులు కొండల్రావు నా బొమ్మల్లో రెండు తీసుకుని "అక్కడ ఎగ్జిబిషన్‌లో పెట్టిస్తాను" అని తీసుకెళ్ళారు. అదే అదనుగా డాడీతో ఆర్ట్ స్కూల్లో చేర్పించమని అర్జీ పెట్టుకున్నాను. "డ్రాయింగ్‌లూ బొమ్మలూ బువ్వ పెట్టవు. ఆర్ట్ స్కూలు రవివర్మలాంటి రాజాలు, జమిందార్లకు. మనక్కాదు" అని పొంగుతున్న నా ఉత్సాహం మీద చన్నీరు చల్లారు.

అదే సమయంలో సినిమాల్లో దృశ్యాలు ఎలా తీస్తారు అని కుతూహలం. సినిమాటోగ్రఫీ గురించి నాకు దొరికిన పుస్తకాలన్నీ చదివాను. నర్సింగ్ డాడీ పలుకుబడి ఉపయోగించి స్టూడియోకి వెళ్ళాం. అక్కడ కెమెరామన్‌ను మంచి చేసుకుని చాలాసేపు మాట్లాడాను. చిన్నవాళ్ళమైన మా ఆసక్తి గమనించి అతను అడిగిన ప్రశ్నలన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు ఇచ్చాడు. నాలోని ఆర్టిస్టు కెమెరాలో ప్రవేశించి ఈ ప్రపంచాన్ని విభిన్న కోణాల్లో దర్శించడం మొదలుపెట్టాడు. ప్రకృతినీ, అన్ని దృశ్యాలను ఎంత అద్భుత రీతుల్లో ప్రదర్శించవచ్చో ఆలోచిస్తుంటే నాకు ఆకాశమే హద్దు అనిపించింది. ఇది వృత్తి విద్య కదా! నా అభిరుచికి తగింది. ఇందులో చేరుదామని ఆశపడ్డాను. ఇంటర్మీడియట్ అయిన తర్వాత - అయింది అనిపించిన తర్వాత - ఎందుకంటే యాక్టింగ్‌కు వెళ్ళలేకపోయాను. డ్రాయింగ్, ఆర్ట్ అంతకంటే వెనక్కు వెళ్ళినై. దాంతో చదువు మీద ధ్యాస తగ్గిపోయింది. అందుకే ఇంటర్మీడియట్ అయింది అనిపించాను. మళ్ళీ మరో ప్రయత్నం చేశాను. అంతా కలిసొస్తే సినిమాటోగ్రఫీ నేర్చుకుందామని ఆశ. శలవుల్లో ఒకరోజు కూర్చుని రాత్రంతా ఆలోచించి శ్రమపడి ఒక ఉత్తరం తయారు చేశాను. చదువుపైనా అయిష్టత, సృజనాత్మక క్షేత్రాల్లో నా అభిరుచి, సినిమటోగ్రఫీ గురించి నా ఆశలు, ఆశయాలు అన్నీ వివరిస్తూ, నాకు పై చదువుల మీద మనసు లేదనీ,

సినిమాటోగ్రఫీ కోర్సులో చేరుతాననీ, బలవంతంగా పై చదువులకు పంపినా అందులో నేను రాణించననీ రాశాను. డాడీతో ముఖాముఖి మాట్లాడ్డానికి బెరుకు. అయినా డాడీ ఎప్పుడూ కోప్పడటం, కొట్టడం లాంటివేమీ చేసేవారు కాదు. ఎప్పుడూ ఆఫీసూ కర్తవ్యమూ ప్రధానంగా నిరంతరం బిజీగా ఉండేవారు. ఇంట్లో అమ్మతోగానీ మాతోగానీ మాట్లాడం, సరదాగా కబుర్లు చెప్పటం చాలా తక్కువ. అందుచేత మా మధ్య అనుకోని దూరం మానసికంగా. అందుకే ఉదయం డాడీ బాత్‌రూంకెళ్ళేటప్పుడు - మామూలుగా న్యూస్‌పేపర్ తీసికెళ్ళారు. నా ఉత్తరం ఇచ్చాను. ఒకసారి ఉత్తరం వైపు మరోసారి నా వైపూ చూసి మాట్లాడకుండా వెళ్ళాను. డాడీ, ఆ రోజు అఫీసు నుంచి తిరిగి వచ్చింతర్వాత టీ తాగుతూ నన్ను పిల్చి కూర్చోబెట్టి - అమ్మ అక్కడే కూర్చుని ఉంది.

"నీ ఉత్తరం చదివాను. ఒకసారి కాదు నాలుగుసార్లు చదివాను. అంతే కాదు ఆఫీసులో నా కొలీగ్స్‌తో చర్చించాను. నీ సినిమాటోగ్రఫీ సబ్జెక్ట్ మంచిదే, కాదనను.కానీ మిగతా అన్ని కళారంగాల్లాగానే ఇదీ ముక్కుసూటి వ్యవహారం కాదు. ఉద్యోగావకాశాలు పరిమితం. ఈ ఉద్యోగం దొరకటానికి ఎన్ని గడపలు ఎక్కి దిగాల్సుంటుందో తెలియదు. జయంకన్నా పరాజయం పాలు అధికం. ఈ పరాజయాలతో నిరాశ నిస్పృహ మనసు చిందరవందర చేసి ఒక అశక్త స్థితికి చేర్చుతే. అప్పుడు మరేమీ చెయ్యాలనే ఆసక్తి ఓపికా రెండు ఉండవు. చదువూ లేక, మరో ఉద్యోగావకాశమూ లేక రెంటికీ చెడ్డవాడివౌతావు. చదువుకుంటే జీవితంలో ఒక ఆధారం ఉంటుంది. అందుచేత ఈ ఆలోచనలు మానుకుని బి.ఎ, బి.ఎస్.సి. ఏదైనా సరే నీకిష్టమైన కోర్సులో చేరు" అంటూ ఉపదేశం ముగించారు. మరో ఎదురుదెబ్బ - నాకిష్టమైన ఏ కోర్సులోనూ అవకాశం ఇవ్వని ఈ చదువు మీద నాకు అసహ్యం కలిగింది. ఒక్క డిగ్రీ చదువుతోనే బతుకు తెరువు సాధ్యం అనే ఈ వ్యవస్థ మీద నాకు ఏవగింపు - నాన్న నాకిష్టమైన ఏ కోర్స్‌లోనైనా సరే చేరమన్నారు. ఏదైనా ఒకటేననే దృష్టితో నేను చేరాను. ఆ తర్వాత నీకు తెలుసుగదా?" అంటూ ముగించాడు సారథి.

"అయిందా?"

"అంటే!" అయోమయంగా చూశాడు సారథి.

"ఇంకా చెప్పవలసింది ఏమైనా ఉందా అని" ఏ భావమూ లేని ప్రశ్న.

"అంతే చదువంటే బోరు. క్లాసులు ఎగ్గొట్టాను. ఇంకా.."

"అవన్నీ అనవసరం."

"మరి...?"

"నీ ఇష్టప్రకారం జరక్కపోతే, నీ ఇష్టం వచ్చినట్లు చేస్తావన్నమాట?" అస్తమిస్తున్న రవికిరణాలు వీణను రాగరంజితం చేసినై.

"అదికాదు వీణా.." తనను మందలించే అధికారం ఈ అమ్మాయికెవరిచ్చారు అనే ఆలోచనను మరేదో సున్నితమైన అనుభూతి కప్పిపుచ్చింది.

"ఏదీకాదు. నచ్చిన పని ఎవరైనా చేస్తారు. చెయ్యవలసిన పని సాధించటంలోనే మన ప్రత్యేకత."

"నీ ఉద్దేశ్యం?" విన్నది ఆకళింపు చేసుకునే ప్రయత్నంలో అడిగాడు సారథి.

"నా ఉద్దేశ్యం కాదు. నీ ఉద్దేశ్యం ముఖ్యం. క్రికెట్, డ్రాయింగ్, ఏక్టింగ్ కాక ఇంకా ఎన్నో ఉన్నాయి ఈ లోకంలో. సాధించి జయిస్తావో, ఓడి పరారవుతావో నీ ఇష్టం."

"ఇంకేముంది సాధించేందుకు?"

"దానికి నువ్వే సమాధానం వెతుక్కోవాలి. నీ ఫ్రెండ్‌గా ఎప్పుడూ నీ


'ప్రియదత్తకు నాలుగవ జన్మదిన శుభాకాంక్షలు'

మా ప్రియ పాఠకులకు, మా పంపిణీ సిబ్బందికి 'తారణ ఉగాది' శుభాకాంక్షలు

❋ శ్రీ టి.వి.సత్యనారాయణ ❋

(న్యూస్ ఏజెంట్)

ఆర్.టి.సి.బస్టాండ్ దగ్గర,



ఇంకొల్లు-523 167

ప్రకాశం జిల్లా

ఫోన్: 08594 244085



శ్రీ ఎ.నారాయణ స్వామి

(న్యూస్ ఏజెంట్)

ప్రొప్రైటర్: రైల్వే బుక్‌స్టాల్

❋ ❋ ❋

చీరాల- 523 155

ప్రకాశం జిల్లా

సెల్ నెం: 94402 65582

❋ పి.ఎస్.ఆర్.ఆంజనేయులు ❋

(న్యూస్ ఏజెంట్)

News agent for all leading Magazines

డోర్ నెం.48-3-27, రంగుతోట,

ఒంగోలు

ప్రకాశం జిల్లా

సెల్: 98497 50250

జయమే కోరతాను. ఇక పోదాం." మరి చర్చకు అవకాశమివ్వకుండా లేచింది వీణ.

* * *

"తర్వాత?" కుతూహలంగా అడిగాడు రవి.

సెప్టెంబరులో బి.కాం. పూర్తిచేశాను. తిరిగి ఇంటికి వెళ్ళి ఎం.కాం. అనో మరేదో అనో డాడీకి భారం అవదల్చుకోలేదు. ఉద్యోగం కోసం చాలా ప్రయత్నం చేశాను. మీకు తెలుసుగా మన ఉద్యోగాల విషయం. అసలే సప్లయ్ డిమాండ్ విలోమానుపాతంలో ఉంటాయి. ఉత్తరం, దక్షిణలతోగాని పనికాదు. దానికి తోడు నా సెప్టెంబర్ డిగ్రీ. ఎంతో ప్రయత్నం మీద ఒక పెద్ద హోటల్‌లో కష్టమర్ సర్వీస్ ఉద్యోగం దొరికింది. ఏమైనాసరే నా కాళ్ళమీద నేను నిలబడాలని నిర్ణయించు కున్నాను. అందుకు ఎన్నో విపరీత పరిస్థితులు ఎదురైనా ఆ హోటల్ ఉద్యోగం వదల్లేదు. అందులోనే నాలుగు నెలలు గడిపాను. ఒక ఆదివారం పేపర్లో ప్రకటన పడింది. రెండు సంవత్సరాల పిల్లవాడిని చూసుకోవటానికి ఆయా కావాలని.

"ఇంతమంది పెద్దవాళ్ళను చూడగలిగిన వాణ్ణి ఒక చిన్నపిల్లవాడిని పెంచలేకపోతానా" అనిపించింది. పేపరు పుచ్చుకుని తిన్నగా ఆ అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాను. భార్య భర్త ఇద్దరూ సుమారు ముప్పై సంవత్సరాల దరిదాపుల్లోని వయసువాళ్ళు. అతను మల్టినేషనల్ కంపెనీలో సేల్స్ మేనేజర్. ఆమె గవర్నమెంట్ ఆఫీసులో. ఇద్దరూ సంపాదిస్తున్నారు గనుక ఇంట్లో దేనికీ లోటు లేదు.

ప్రప్రథమంగా ఆయా పనికి నన్ను చూడగానే దంపతులిద్దరూ ఆశ్చర్యపోయారు. నా పూర్వాపరాలు అన్నీ విచారించిన తర్వాత "పిల్లల్ని పెంచడం నీవల్ల అవుతుందా? అని సందేహం వెలిబుచ్చారు.

"నా పసితనంలో నాకేం కావాలనిపించేదో, ఏం లభించిందో ఏం దొరకలేదో ఏది సంతోషం ఏది విచారం కలిగిస్తుందో నాకు తెలుసు గదండీ! అంతా మనస్తత్వం ఒకటేగదండీ! ఎందుకంటే అదే ప్రేమ, వాత్సల్యం, కోపం, సంతోషం, దుఃఖం.. కదా ప్రతి మనసులోనూ నిండి ఉన్నది. అందుకని మీ బాబుని బంగారంలా చూసుకుంటాను" నా సమాధానంతో వాళ్ళు సమాధానపడినట్లే ఉన్నారు.

"అయినా మగవాడివి.." శ్రీమతి సందేహం వెలిబుచ్చారు.

"మేడం! ఆయాలుగా వచ్చే స్త్రీలకు యాంత్రికంగా పిల్లల్ని పెంచటమే తెలుసు. నాలాంటి వాళ్ళకు కొత్త ఆలోచనలు సరికొత్త ఊహలు ఉండి మీ బాబు ఇంకా బాగా ఎదగవచ్చు. అంతేకాదు నేను జీతంకన్నా ఈ ఉద్యోగం ఒక ఛాలెంజ్‌గా భావించి వచ్చాను." అన్నాను.

భార్యాభర్తలిద్దరూ మొహమొహాలు చూసుకున్నారు. లోపలికి వెళ్ళి పది నిమిషాల్లో వచ్చి - నాకు ఆ ఉద్యోగం ఇచ్చారు. జీతం దగ్గరికొచ్చేసరికి నాకు ప్రస్తుతం వచ్చే జీతం సంగతి చెప్పి "మీకు తోచినంత ఇవ్వండి. మీ బాబును ఏ లోటూ రాకుండా పెంచటమే నా ధ్యేయం" అన్నాను. నా ఉద్యోగం ఖాయమైంది. ఉదయం ఎనిమిదిన్నర, తొమ్మిది గంటలకు ఇద్దరూ ఆఫీసులకు వెళ్ళినప్పట్నుంచి సాయంకాలం ఆరు ఏడు గంటలకు వాళ్ళు తిరిగి వచ్చేదాకా బాబీని (బాబు ముద్దు పేరు. అసలుపేరు అరుణ్.) చూసుకుండేవాణ్ణి. వాడికి పాలు పట్టడం, డ్రాయర్లు మార్చడం, బ్రేక్‌ఫాస్ట్, లంచ్ తినిపించటం, ఆడించటం, నిద్రపుచ్చడం మొదటి రెండు రోజులూ కొత్తగా అనిపించినా, ఆ వయసులో నేనేం కోరుకునేవాణ్ణి అని ప్రశ్నించుకుంటే సమాధానాలు సులువుగా దొరికేవి.

బ్రేక్‌ఫాస్ట్, లంచ్ తినక మారాం చేస్తుంటే కబుర్లు కథలు చెప్పి తినిపించటం నాకు ఛాలెంజి అయ్యేది. బలవంతంగా కాక ముద్దుగా మురిపెంగా బాబీచేత తినిపిస్తూంటే ఏదో విజయోత్సాహం నాలో పరవళ్ళు తొక్కేది. మధ్యాహ్నం లంచ్ తర్వాత నేను చెప్పే కథలు వింటూ నా గుండెలమీద నిశ్చింతగా నిద్రపోయే బాబీని చూస్తుంటే అలౌకిక ఆనందం కలిగేది. వచ్చీ రానీ మాటలతో బాబీ "చేత వెన్నముద్ద.." లాంటి పద్యాలు చెబుతుంటే నేనే చిన్ని కృష్ణుడినై గజ్జెలు ఘల్లు ఘల్లుమనిపిస్తూ ఇల్లంతా పరుగులెత్తిన భావన.. బాబీకి మూడు సంవత్సరాలు నిండేసరికి ఈత నేర్పించాను. వాడు స్విమ్మింగ్ పూల్ ఒక చివరి నుంచి మరొక చివరికి పూల్‌లో తేలుతూ ఈదుతుంటే చిన్నారి పడవ తేలుతున్నట్లుండేది. నాలుగో సంవత్సరం పూర్తయ్యేసరికి బాబీకి ఇంగ్లీషు అక్షరాలు గుర్తుపట్టడం ఆట అయింది. మేమిద్దరం కలిసి పార్క్‌లో పరుగులెత్తి, జంగిల్, జిం, సీ-సా అన్నీ సమానంగా ఆడేవాళ్ళం. అలా రెండు సంవత్సరాలు గడిచిపోయిన సంగతి ఒకనాడు "బాబీకి ఐదో సంవత్సరం రాబోతున్నది. స్కూల్లో వేద్దామనుకుంటున్నాము" అని వాళ్ళమ్మ అనేదాకా, నాకు తెలియలేదు. హఠాత్తుగా నాలోంచి నా గుండెలోంచి ఒక భాగం వేరయిపోతున్నట్లనిపించింది.

"స్కూలు మధ్యాహ్నం పన్నెండున్నర వరకే. అయినా సాయంత్రం నేను వచ్చేదాకా బాబీని చూసుకుంటామన్నారు". బాబీ వాళ్ళమ్మ చెప్పుకుపోతున్నది. భౌతికంగా వింటున్నా బుర్ర పనిచెయ్యటం లేదు. ఉద్యోగంకన్నా బాబీ నా నుంచి వేరైపోతున్నాడనే ఊహ తాత్కాలికంగా ఆక్సిజన్ అవసరమైన పేషంట్‌ను చేసేసింది. కానీ తప్పదు. నటన, క్రికెట్, పెయింటింగ్‌ల లాగా ఇది మరో ఎడబాటు.

"ఈ రెండు సంవత్సరాలూ బాబీని కంటికి రెప్పలా చూసుకున్నావు. నాకు ఉద్యోగం లేక పోయినా వాడ్ని ఇంత బాగా పెంచుకో గలిగేదాన్ని కాదేమో. వాడ్ని ఎన్నోసార్లు రాత్రులు నిద్రలో మీ కోసం కలవరించేవాడు." బాబీ వాళ్ళ అమ్మ అంటుండగా "వాడికి మీరు నేర్పిన కథలు పద్యాలు బాబి నోట వింటుంటే మేం రోజంతా అనుభవించిన శ్రమ చేత్తో తీసేసినట్లు మాయమయ్యేది" అని బాబీ వాళ్ళ నాన్న.



"బాబీని చూసుకోడానికి మీలాంటివాళ్ళు దొరకటం మా అదృష్టం." వాళ్ళమ్మ "అవును ఆ తర్వాత ఏం చెయ్యదల్చుకున్నావ్?" ప్రస్తుతంలోకి లాక్కొచ్చి పడేస్తూ బాబీ తండ్రి ప్రశ్న.

"ఇంకా ఏమీ అనుకోలేదండీ" బాబీ నుంచి ఎడబాటు అనే షాక్ నుంచి నేను ఇంకా తేరుకోలేదు.

"బాబీని 'గురుకులం' లో చేరుస్తున్నాం. అది మామూలుకన్నా విలక్షణమైన ప్రయోగాత్మక విద్యాలయం. మొదటినుంచి పిల్లల అభిరుచిని గమనిస్తూ అదే మార్గంలో వాళ్ళను ప్రోత్సహిస్తూ శిక్షణనిచ్చే స్కూలు" బాబి తండ్రి చెప్తున్నాడు.

"అద్భుతం సర్! బాబీకి జీవితంలో మీరిచ్చే పెద్దకానుక."

"థాంక్స్. ఆ 'గురుకులం' స్థాపించింది నా స్నేహితుడే. నీకిష్టమైతే ఆ స్కూల్లో పని చెయ్యొచ్చు."

"ఓ థ్యాంక్స్ సర్. థ్యాంక్యూ వెరీమచ్." సారథి ఆనందం చూసి తీరాలి. బాబీ పూర్తిగా దూరం కావటం లేదన్న యదార్థంతో.

* * *

"కమాన్ రవి, సారథి - లంచ్ రెడీ!" వీణ పిలుపుతో ఇద్దరూ లేచారు.

"సారథీ నీ కోసం ప్రత్యేకించి ఏమీ చెయ్యలేదు. కాకరకాయ వేపుడు, పప్పు, అవకాయ, పెరుగన్నంలోకి మామిడి పళ్ళు. అంతే" టేబుల్ దగ్గర వంటకాలు వివరించింది వీణ.

"మిమ్మల్ని కలుసుకోవటమే నాకు పెద్ద విందు"

"గురుకులంలో ఏం చేస్తున్నావ్?"

"పంతులు - అదే డ్రాయింగ్ టీచర్. యాక్టింగ్ టీచర్, క్రికెట్ టీచర్.. అన్నీ నేనే!"

"యాక్టర్ నుంచి డైరెక్టర్ లెవెల్‌కు చేరుకున్నావన్నమాట!" వీణ స్వరంలో సంతోషం.

"అవును వీణా! ఆ చిన్నారుల ఆశలూ, ఆశయాలు గమనిస్తుంటే, వీళ్ళ ఆశలకు దోహదం చెయ్యటానికి నేనెంత అదృష్టవంతుడిని" అనిపిస్తుంది.

"ఆవకాయలో నెయ్యి వేసుకోండి. లేకపోతే ఆవకాయ ఘాటు నషాళానికంటుతుంది." సారథికి నెయ్యి వడ్డిస్తూ అన్నాడు రవి. "వంశీ తెచ్చిన లిటిల్ స్టోరీస్' రచయిత వీణ అని ఉన్నది. నువ్వెప్పుడు రాశావ్?" వీణను అడిగాడు రవి.

"నేనా జోక్ చెయ్యకు. నీకు తెలుసా సారథీ?" వీణ సారథినడిగింది.

"నాకు ఒక్క వీణే తెలుసు. నువ్వు?" సారథి చిరునవ్వుతో అన్నాడు.

"ఒకే. కానీ లిటిల్ స్టోరీస్ రాసింది ఈ వీణ కాదు."

"నీవు కాదు, సరే నీకు తెలిసినవాళ్ళు నీ పేరుతో రాయొచ్చుగా?" సారథి ఎదురు ప్రశ్నకు మేలుకుంటున్నట్లు "అంటే?" అన్నది వీణ.

"పిల్లలకు నేను చెట్లకింద చేర్చి చెప్పే కథలు విని వాటికి అక్షర రూపం కల్పించమన్నారు మా గురుకులం డైరెక్టర్. తీరా రాయటం పూర్తయ్యాక నా జీవితంలో గురువును మర్చిపోలేక, చంద్రుడికో నూలుపోగులా రచయితకు ఆ పేరు నిశ్చయించాను." సారథి తృప్తి నిండిన గుండెలతో పలికాడు.

"ఓ మై గాడ్!" సంతోషం. ఆశ్చర్యం, షాక్‌తో వీణ అచేతన అయింది.

"మమ్మీ... లిటిల్ స్టోరీస్ సూపర్బ్ మమ్మీ!" హాల్లోకి పరిగెత్తుకొచ్చి పుస్తకం చూపిస్తూ అన్నాడు వంశీ అమ్మ ఒళ్ళో వాలుతూ.

"అదిగో అదీ నీ కృషికి అసలైన జయభేరి. హార్టీ కంగ్రాచ్యులేషన్స్ సారథీ" సంతోషం సంతృప్తి నిండిన స్వరంతో అన్నది వీణ.

"అంతా నీ చలవ! ఈ జయం నీది. థ్యాంక్యూ." *


'ప్రియదత్తకు నాలుగవ జన్మదిన శుభాకాంక్షలు'

మా ప్రియ పాఠకులకు, మా పంపిణీ సిబ్బందికి 'తారణ ఉగాది' శుభాకాంక్షలు

* పుష్పగిరి ఏజెన్సీస్ *

శ్రీ ఎ.టి.రామకృష్ణ (న్యూస్ ఏజెంట్)

డోర్ నెం: 6/1376, శంకరపురం

కడప - 516 002

కడప జిల్లా

ఫోన్ నెం: 248175

శ్రీ పి.రామాంజనేయులు

(న్యూస్ ఏజెంట్)

45-142-16-ఎ, మేడమీద,

వెంకటరమణ కాలనీ,

కర్నూల్-518 003

కర్నూల్ జిల్లా

ఫోన్ నెం. : 08518 250411,

సెల్ నెం:94402 44404

శ్రీ ప్రవల్లికా ఎంటర్‌ప్రైజెస్

ప్రొ.శ్రీ.యస్ రామమూర్తి,

(న్యూస్ ఏజెంట్)

డోర్ నెం:30/41, సి-3

అలిమాబాద్ వీధి

రాయచోటి -516 269

కడప జిల్లా

డి.టి.డి.సి.కొరియర్, పీలేరు

ఫోన్ : 08584 240153